# 23. ముస్లిం చేసే దానధర్మాలు

మహాప్రవక్త (సఅసం) ప్రబోధించారని అబూ మూసా అష్అరి (రజిఅన్) నుడివారు: "దానం ఇవ్వటం ప్రతి ముస్లింకు తప్పనిసరి." సహచరులు అడిగారు - 'ఒకవేళ అతని వద్ద లేకుంటే?!' ఆయన (సఅసం) అన్నారు : 'అతను తన స్వహస్తాలతో శ్రమించి సంపాదించాలి. (దాంతో) తన స్వయానికి ప్రయోజనం చేకూర్చాలి మరియు దానం ఇవ్వాలి.' సహచరులు సందేహంగా అడిగారు - 'ఒకవేళ అలా చేయలేకపోతే? లేదా చేయకపోతే?' ఆయన (సఅసం) ప్రబోధించారు : 'దయనీయ స్థితిలో ఉన్న అగత్యపరునికి సహాయపడాలి.' సహచరులు అడిగారు - 'ఒకవేళ అలా చేయకపోతేనో?' ఆయన (సఅసం) బదులిచ్చారు : 'మంచిని ఆజ్ఞాపించాలి'. సహచరులు మళ్ళీ అడిగారు - 'ఒకవేళ అది కూడా చేయలేకపోతే?!' ఆయన (సఅసం) చెప్పారు : '(పరులను) నొప్పించకుండా జాగ్రత్త పడాలి. ఇది కూడా అతని పాలిట దానమే." (బుఖారి)

**తాత్పర్యం :**

ఈ హదీసును ఉల్లేఖించిన వారు అబూ మూసా అష్అరి (రజిఅల్లాహు) హిజ్రత్‌కు ముందే ఈయన మక్కా వచ్చి ఇస్లాంను స్వీకరించారు. తరువాత తన జాతి వారి వైపునకు మరలివెళ్ళారు. కొంత కాలం గడిచిన తరువాత ఆయన తన దేశం నుండి ఓడలో బయలుదేరారు. మార్గమధ్యంలో గాలి దిశ మారిపోవటం వల్ల ఈయన ఆఫ్రికాకు చేరుకోవలసి వచ్చింది. అక్కడ ఆయన జాఫర్ బిన్ అబీ తాలిబ్ (ర.అ) వద్ద ఆగారు. ఆ తరువాత ఆయనతో పాటే హిజ్రీ 6 వ సంవత్సరం మదీనా వచ్చారు. మహాప్రవక్త (సఅసం) ఈయన్ని యమన్‌లోని కొన్ని ప్రాంతాలకు అధికారిగా నియమించారు. ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజిఅన్) హయాంలో ఈయన బస్రా గవర్నర్‌గా నియమితులయ్యారు. హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) కాలంలో కూఫా గవర్నర్ పదవి లభించింది. ఉమర్ గారి కాలంలో ఈయన 'అహ్వాన్', 'అస్‌బహాన్'లను జయించారు. ఈయనగారి కంఠస్వరం మృదు మధురమైనది. తనను కలుసుకున్నప్పుడల్లా ఖుర్‌ఆన్‌ను చదివి వినిపించమని హజ్రత్ ఉమర్ ఈయన్ని కోరేవారు. ఖలీఫా కోరిక మేరకు ఈయన ఖుర్‌ఆన్ పఠించి వినిపించేవారు. బస్రా ప్రజల్లో ఈయన ఖుర్‌ఆన్ మరియు సత్యధర్మాన్ని వ్యాపింపజేశారు. దాదాపు హిజ్రీ శకం 50వ ఏట ఈయన కాలధర్మం చెందారు - అప్పటికి ఈయన వయస్సు రమారమి 63 సంవత్సరాలు.

https://teluguislam.net

"దానం ఇవ్వటం ప్రతి ముస్లింకు తప్పనిసరి." ముస్నద్ తియాసి ఉల్లేఖనంలో "ప్రతిరోజు" అనే పదం అదనంగా ఉంది. ఈ దానం శక్తిమేరకు ప్రతి ఒక్కరిపై తప్పనిసరి అవుతుంది. అంటే ప్రతి ముస్లిం నైజంలో, అతని ప్రవర్తనలో సదకా (దానం) ఒక భాగం కావాలన్నది దీని పరమార్థం. అతను ఏ స్థితిలో ఉన్నా - కలిమిలో ఉన్నా లేమి తాండవిస్తున్నా - అతనిలో దాతృస్వభావం మాత్రం ఉండాల్సిందే అన్నది పై వాక్యం ఉద్దేశ్యం.

'ఒకవేళ అతని వద్ద లేకపోతే' అని ప్రవక్త గారి ప్రియసహచరులు ప్రశ్నించారు. 'దానం' అనే ప్రస్తావన రాగానే ధన ధాన్యాదుల ద్వారా చేసే సహాయం మాత్రమేనని అసలు సహచరులు తలపోశారు. అయితే ఈ "పదం"కు ఉన్న భావం ఎంతో విస్తృతమయిందని, అపదలో ఉన్న ఒక వ్యక్తిని మృదువుగా పలకరించి అతన్ని ఓదార్చటం, అతని ఆపదను కడతేర్చే సంకల్పంతో తరుణోపాయం సూచించటం కూడా "సదకా" కోవలోకే వస్తుందని మహనీయ ముహమ్మద్ (సఅసం) విశ్లేషించారు.

ఈ నేపథ్యంలో ఇబ్నె అబీ హమ్జ ఇలా అభిప్రాయపడ్డారు :

"దాన ధర్మాలు చేయడం కేవలం శ్రీమంతులకే పరిమితం కాదని, డబ్బు ఖర్చుపెట్టకుండా కూడా దానధర్మాలు చేయవచ్చని ఈ హదీసు ద్వారా అధారం లభిస్తున్నది."

"అతను తన స్వహస్తాలతో శ్రమించి సంపాయించాలి." అన్న ప్రవక్తగారి పలుకు గమనించదగినది. కష్టపడి ఉపాధిని సంపాయించటం చాలా ముఖ్యం అని దీనిద్వారా విదితమవుతుంది. కష్టపడి సంపాయించగలిగినప్పుడే ఏ మనిషయినా తన స్వయానికై ఖర్చుచేసుకుని ఇతరుల కేదైనా సహాయం చెయ్యగలుగుతాడు. శ్రమించి సంపాదించుకుంటేనే, ఎదుటివారి ముందు చేతులు చాచి యాచించే దురవస్థ రాకుండా జాగ్రత్త పడగలుగుతాడు. పైపెచ్చు సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తూ, ఆత్మాభిమానాన్ని కాపాడుకుంటూ, వీలయినంత ఎక్కువగా నిరాధారులను ఆదుకోగలుగుతాడు.

"దయనీయ స్థితిలో ఉన్న అగత్యపరునికి సహాయపడాలి" అనేది హదీసులోని మరో వాక్యం. అటువంటి సహాయం నోటిద్వారా కావచ్చు. చేతల ద్వారా కూడా కావచ్చు. మరోవిధంగా కూడా కావచ్చు. సహాయపడే తీరు ఎన్నో రకాలు.

"మంచిని గురించి ఆజ్ఞాపించాలి" అనేది మరో వాక్యం. వేరొక ఉల్లేఖనంలో "చెడుల నుండి ఆపాలి" అని కూడా ఉంది. మంచిని ఆజ్ఞాపించటంలోనే "చెడుల నుండి ఆపటం" అనే భావం ఇమిడి ఉంది. ఖుర్ఆన్ హదీసుల వెలుగులో సమ్మతమయిన

https://teluguislam.net

ప్రతిదీ 'మంచి'గానే పరిగణించబడుతుంది. అలాగే ఖుర్‌ఆన్, హదీసులలో ఏవేవైతే 'కూడదు' అని అనబడ్డాయో అవి చెడుగానే పరిగణింపబడతాయి. వాటి జోలికి ప్రజలను పోనివ్వకుండా చూడటం కూడా గొప్ప సత్కార్యమే.

"(పరుల మనసు) నొప్పించకుండా జాగ్రత్త పడాలి." నోటి ద్వారానయినా, చేతల ద్వారానయినా లేక ఆ రెండింటి ద్వారానయినా ఎదుటివారు నొచ్చుకునేలా ప్రవర్తించరాదు. ఎట్టి పరిస్థితిలోనూ దైవ ప్రసన్నత చూరగొనటమే దీనివెనుక అసలు ప్రేరణ అయివుంటే తప్పకుండా ఇది సయితం పుణ్యకార్యంగానే పరిగణించ బడుతుంది. దైవదాసులకు బాధ కలగకుండా మసలు కోవటం ఒక నిజమైన ముస్లిం యొక్క చిహ్నం. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించిన హదీసు ద్వారా ఇదే భావం వ్యక్తమవుతోంది. ఆయన ఉల్లేఖించిన ప్రవచనం ఇలా ఉంది : నిజమైన ముస్లిం అతనే - ఎవరి నోటి మరియు చేతుల బారి నుండి ముస్లింలు సురక్షితంగా ఉండగలరో."

"ఒకవేళ అలా చెయ్యలేకపోతే," ప్రవక్త సహచరులు పలు కోణాల నుంచి ఒక విషయం యొక్క లోతుపాతులను తెలుసుకునేవారు. వారలా అడగటం వల్లనే "విషయం" ప్రాముఖ్యతను సంతరించుకుంది. సదకా (దానం) యొక్క విస్తృత భావం కూడా తెలిసివచ్చింది. దానధర్మాలు చేయటం, అవసరం ఉన్న వారిని ఆదుకోవటం, మంచిని గురించి ఆజ్ఞాపించటం, చెడుల నుండి ఆపటం ఇవన్నీ చెయ్యవలసిన ముఖ్య పనులేనని, వీటికిగాను దైవసన్నిధిలో ప్రతిఫలం కూడా అపారమని తెలియవచ్చింది.

ఈ హదీసు ద్వారా స్పష్టమయిన మరో విషయం ఏమిటంటే, సత్కార్యాలు వాటి ప్రాముఖ్యత, ప్రతిఫలాల దృష్ట్యా ఎన్నో స్థాయిలను కలిగి ఉంటాయి. అయితే వీటిలో అన్నిటికన్నా ఉత్తమమయినది, మనిషి తన ధనాన్ని ఇతరులకు దానం చేయటం. ఒక ముస్లిం ఫకీరు - భిక్షకుడు - దైవమార్గంలో ఖర్చుపెట్టలేకపోతే అతను, అది మినహా మిగతా సత్కార్యాలపై చొరవచూపాలి. అల్లాహ్ ఏ ప్రాణిపైనా అతని శక్తికి మించిన భారం మోపడు. మనిషి, తాను ఏ సత్కార్యమూ చేయలేకపోతే, అతను కనీసం చెడుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి.

ఈ హదీసు ద్వారా విదితమయ్యే మరో విషయం ఏమిటంటే, షరీఅత్ ఆదేశాలు - స్థితిగతుల దృష్ట్యా - స్వల్పమయిన వ్యత్యాసంతో వర్తిస్తాయి. ప్రవక్త మహనీయులు (సఅసం), ప్రతి ముస్లిం దానం ఇవ్వటం తప్పనిసరి అని ఖరారు చేశారు. అయితే ప్రతి ముస్లిం దానధర్మాలు చెయ్యలేడు. పైగా కొంతమందైతే దానాలు పుచ్చుకోవటం

https://teluguislam.net

తప్ప మరో గత్యంతరం లేని స్థితిలో ఉంటారు. అటువంటప్పుడు పుచ్చుకోవడం వారికొరకు సమంజసమే అవుతుంది. విషయాన్ని కూలంకషంగా అర్థం చేసుకునే ఉద్దేశ్యంతో మాటిమాటికీ విద్వాంసుని అడగవచ్చు అని కూడా ఈ హదీసు ద్వారా తెలియవస్తోంది. అదేవిధంగా కష్టపడి చెమటోడ్చి సంపాయించడం శ్రేష్ఠతతో కూడుకున్న విషయమని అలా సంపాయించే వాడే తనను ఆదుకోవటంతో పాటు ఇతరులను కూడా ఆదుకోగలుగుతాడని అవగతమవుతోంది.

గ్రంథ రచయిత మౌలానా సఫీ అహ్మద్ మదనీ జమీఅతె అహ్లెహదీస్ క్రియాశీలక కార్యకర్తల్లో ఒకరు. ఈయన ప్రాథమిక ధార్మిక విద్యాభ్యాసాన్ని ఉమ్రాబాద్ (తమిళనాడు)లోని జామియ దారుస్సలాంలో అర్జించారు. అనంతరం బనారస్‌లోని జామియ సలఫియాలో ఉన్నత విద్య నభ్యసించి మదీనాలోని ఇస్లామీయ యూనివర్శిటీ నుండి పట్టభద్రులయ్యారు. ప్రస్తుతం ఈయన హైదరాబాదులో జమాఅత్ కార్యకలాపాలలో నిమగ్నులై ఉన్నారు.

"కలామె హిక్మత్"లో ఈయన అసంఖ్యాకమయిన, సమగ్రమయిన హదీసులను (ప్రవక్త ప్రవచనాలను) సంకలనం చేసి పవిత్ర ఖుర్‌ఆన్ వెలుగులో వాటిని విశదీకరించారు. ఈ సందర్భంగా రచయిత ప్రఖ్యాత హదీసువేత్తల, ప్రముఖ ప్రాచీన విద్వాంసుల (ఉలమాల) విధానాన్ని దృష్టిలో ఉంచుకుని, వీలయినంతవరకు వారి అడుగుజాడల్లోనే తన ప్రయత్నాన్ని ముందుకు సాగించారనిపిస్తుంది. ఈ కృషి శ్లాఘనీయమనటంలో సందేహం లేదు. ఈ గ్రంథం అధ్యయనం వల్ల పాఠకులకు ఎన్నో ధార్మికవిషయాలు బోధపడగలవని ఆశిస్తున్నాను. కారుణ్య ప్రభువయిన అల్లాహ్ రచయిత కృషిని స్వీకరించాలని ప్రార్థిస్తున్నాను.

**- మౌలానా ముహమ్మద్ నజీర్**

**నాజిమ్** : ప్రసార, ప్రచార, ప్రచురణల విభాగం

జమీఅతె అహ్లెహదీస్, ఆంధ్రప్రదేశ్

https://teluguislam.net